

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 7 సంచిక : 19 పుష్పం : 52-54 20-06-2002

**RAMANA BHASKARA**
**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**
PAGES : 16

**VOL : 7** **ISSUE : 19**

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278


## నిన్ను నీవు చూసుకొని తరువాత ప్రపంచాన్ని చూడు

సాధారణంగా నేటి ప్రపంచంలో అసంతృప్తి, వైషమ్యాలు, కరువు, దారిద్ర్యం, వ్యాధులు మున్నగునవి విలయతాండవం చేస్తూ, ఎందుకు ప్రపంచం ఇంత దుఃఖభూయిష్టంగా వుందనే సంశయం మనకు కలుగుతూ వుంటుంది. దీనికి భగవాన్ శ్రీరమణులు ఈవిషాదం అంతా ఎవరికి కనబడుతోంది? అని ప్రశ్నించుకోమంటారు. దానికి జవాబు 'నాకు' అని వస్తుంది. కాని గాఢనిద్రలో పై అశాంతిగాని, దుఃఖంగాని, అనుభవంలో లేదు,

ఈ సంచికలో...... **సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు**


02-04-2002 లంకలకోడేరు ........ 3
27-05-2002 పాలకోడేరు ........ 8
04-06-2002 పాలకొల్లు ........ 12



Visit us @ www.srinannagaru.com




కేవలం జాగ్రదవస్థలోనే వస్తున్నాయి. ప్రయత్నపూర్వకంగా జాగ్రదవస్థలో ఎఱుకతో, లోచూపును అలవరచుకొని స్వరూపంలో నిలకడ పొందినప్పుడు ఈ ప్రపంచమూ, దాని తాలూకు బాధలు అదృశ్యమవుతాయి.

ప్రపంచం మనకు భిన్నంగా, బాహ్యంగా లేదు. దేహంతో తాదాత్మ్యం చెందటం వల్ల, వేరుబుద్ధి వలన ప్రపంచం మనకు బాహ్యంగాను, దుఃఖమయంగాను కనబడుతోంది. సత్యాన్ని అనుభవంలోనికి తెచ్చుకొనే ప్రయత్నంలో అసత్య భావాలనుండి దూరమవుతాము. మొదట నిన్ను నీవు చూచుకొని, ఆ తర్వాత ప్రపంచాన్ని చూడు, అప్పడు ప్రపంచం 'ఆత్మ' మయంగా కనబడుతుంది అంటారు శ్రీరమణులు. మనలను మనం శరీర మాత్రుడిగానే భావిస్తున్నంతకాలం ప్రపంచం మనకు వేరుగానే కనిపిస్తుంది. 'ఆత్మ' అనుభవంలోనికి వస్తే, ప్రపంచం 'ఆత్మ'గానే కనిపిస్తుంది. అహంకారం పుట్టుక స్థానాన్ని నిరంతరం వెతకటం ద్వారా స్వరూపం అనుభవంలోనికి వచ్చినప్పుడు, శాశ్వతమైన పరమశాంతికి వారసులమవుతాము. అప్పడు మనకు నిత్య నిరతిశయానందం లభిస్తుంది. పరమశాంతిని స్వరూపంగా అనుభవంలోనికి తెచ్చుకోవడమే మన జీవిత గమ్యం.

**చావలి సూర్యనారాయణ మూర్తి**
టీచర్, అమలాపురం

# రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 02-04-2002, లంకలకోడేరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం ఏపనిచేసినా శ్రద్ధగా చేయాలి, భక్తిగా చేయాలి. పరమేశ్వరుడిపట్ల మనకు ఉన్న ప్రేమనే భక్తి అంటారు. భక్తి ఉన్నవాడు నా స్వరూపమును పొందుతాడు అని భగవంతుడు గీతలో చెప్పాడు. ఆధ్యాత్మికజీవితానికి మనం చేస్తున్న పూజ, జపం, ధ్యానం, క్రమశిక్షణగా జీవించటం ఇవి అన్నీ పెట్టుబడి. భగవంతుని నిరంతరం స్మరించటం వలన ఆరోజుకారోజు మనం పవిత్రులమవుతాము, ఇంద్రియాలకు మనస్సుకు నిగ్రహం వస్తుంది, బుద్ధికి ఏకాగ్రత వస్తుంది, చివరలో మోక్షం వస్తుంది. ఇది అంతా ఈశ్వరస్మరణ వలన జరుగుతుంది. మనకు ఉండవలసినంత వినయంగాని, భక్తిగాని, ఈశ్వరుడు ఉన్నాడు అని సజీవమైన విశ్వాసం గాని మనకు లేదు. మనం శారీరకఆరోగ్యానికి ఇచ్చే ప్రాముఖ్యత, మానసికఆరోగ్యానికి ఇవ్వటం లేదు. జీవుడికి చావు అనేది లేదు. చావు అనేది నూటికి నూరు పాళ్ళు అసత్యం. నేను ఈ చొక్కా తీసివేస్తే నాన్నగారు లేరు అని మీరు అనుకోరు, నాన్నగారు ఉంటారు. ఈ శరీరాన్ని కప్పిఉంచటానికి చొక్కా వేసుకొన్నాను అలాగే లోపల జీవుడిని కప్పి ఉంచటానికి ఈ శరీరాన్ని పరమేశ్వరుడు ఇచ్చాడు. చొక్కా మారినా శరీరం అలాగే ఉంటుంది, అలాగే శరీరం మారినా జీవుడు అలాగే ఉంటాడు. మనం చొక్కాలు ఎలా మార్చుకొంటున్నామో అలాగే జీవుడు శరీరాలు మార్చుకొంటూ ఉంటాడు. శరీరంలో ఎన్ని రోగాలు ఉన్నా ఇబ్బందిలేదు శరీరం మరణించినప్పుడు స్మశానంలో శరీరంతోపాటు ఆరోగాలు కూడా కాలిపోతాయి. కాని మనస్సులో ఉన్న రోగాలు చాలా ప్రమాదం, ఈ శరీరం ఉండగావాటిని తొలగించుకోకపోతే మరల జన్మలో అవి మనకూడా వచ్చేస్తాయి. మనలో ఉన్న రాగద్వేషములే పునర్జన్మకు కారణం. శరీరం ఉండగానే వాటి వేగాన్ని తగ్గించుకోవాలి. ఈ దోషాల నుండి విడుదల పొందటానికే సత్పురుషుల సహవాసం, సద్గ్రంధముల అధ్యయనం, జపం, ధ్యానము, తపస్సు. మనం చెవులతో వినేమాటల వలన, కంటితోచూసే విషయముల వలన, మనకు వచ్చే తలంపుల వలన మనకు కోరికలు పెరగకూడదు, రాగద్వేషములు పెరగకూడదు. మనకు ఉన్న కోరికలనుబట్టి, వాసనలను బట్టి భవిష్యత్ జన్మలు నిర్ణయింపబడతాయి. తపస్సులు చేసేవారికి ఏ ఫలితం వస్తుందో, ఆశ లేకుండా పనిచేసేవారికి కూడా అదే ఫలితం వస్తుంది అని భగవంతుడు చెప్పాడు. ఆశతో పనిచేస్తే బంధింపబడతాము, ఆశలేకుండా పనిచేస్తే బంధంలోనుండి విడుదల





పొందుతాము.

జ్ఞానం రావటం కష్టం అని చాలామంది అనుకొంటారు. అది పెద్దకష్టమేమీకాదు. ఆత్మ జ్ఞానమును పొందాలి అని స్థిరమైన నిర్ణయం ముందు ఉండాలి. ఆత్మ విశ్వాసం ఉండాలి. ఆత్మవిశ్వాసం ఉన్నవాడికి ఈ సృష్టిలో అసాధ్యం అంటూ ఏదీలేదు. మన డ్యూటీ మనం చేయటం మానివేసి, సాధన చేయటం మానివేసి దైవసహాయం లేదు అంటాము, ఇది అన్యాయం, మనకు సరియైన అవగాహన లేదు అని అర్థం. మనచేతిలో ఉన్నపనిని హృదయ పూర్వకంగా చేయాలి. ఈశ్వరుడు ఉన్నాడనే సజీవమైన విశ్వాసం మనకు ఉండాలి. భగవదనుగ్రహం పొందటానికి అనుగుణంగా మనమాట, మనచేత, మన తలంపు ఉండాలి, అప్పుడు మనకు శరణాగతి కలుగుతుంది. శరణాగతి ఎప్పుడైతే వచ్చిందో శరీరంలో ప్రతీ ఇంద్రియంలోను మార్పు వస్తుంది. ఆత్మానుభవం పొందాలనుకొన్నప్పుడు ఇంద్రియభోగాలు కొంచం తగ్గించుకొంటూరావాలి. ఇంద్రియభోగాలు తగ్గమంటే తగ్గవు. ఈశ్వరుని స్మరించగా, స్మరించగా విషయ సుఖాలపట్ల ఆసక్తి తగ్గుతుంది, ఈశ్వరునిపట్ల ఆసక్తి పెరుగుతుంది, ప్రేమ, అనురాగం, భక్తి పెరుగుతుంది. మీరు శరీరం యొక్క శుచి చూసుకొంటున్నారుగాని మనస్సు శుచి చూసుకోవటంలేదు. మనస్సు శుచిగా ఉండాలి. మనస్సు ఎంత శుచిగా ఉంటే అంత తొందరగా ఆత్మానుభవం కలుగుతుంది. సాధన బాగా జరగాలంటే ఆహారం విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉంటే శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం బాగుంటాయి. మనం సాధనచేస్తున్నా అభివృద్ధి కనిపించటంలేదు అంటే దానికి కారణం అహంకారం, మమకారం. అప్పదాచుకోవటం, అహంకారం దాచుకోవటం రెండూ చాలా ప్రమాదం. ఇతరులకు మంచిచేసి మనం రజోగుణం పెంచుకోకూడదు. నువ్వు ఇతరులకు ఒక పండు ఇస్తే దానివలన నీకు సుఖం రావాలి, ఇతరులకు సుఖం రావాలి. రజోగుణంతో ఏ పనిచేసినా ఇచ్చినవాడికి, తీసుకున్నవాడికి కూడా సుఖం ఉండదు. పూర్వం ఒక మహాత్ముడు ఎదుటివారికి పండు ఇస్తే తలవంచుకొని ఇచ్చేవాడు. ఎందుకు తలవంచుకొని ఇస్తున్నారు, మొఖం చూసి ఇవ్వవచ్చుకదా అని అడిగితే ఇవ్వటానికి నేను ఎవడిని అని చెప్పారు. ఆ మామిడిపండు ఎవరు ఇస్తున్నారు. భగవంతుడే ఇస్తున్నాడు. భగవంతుడు నాకు ఆ మామిడిపండు ఇస్తే మీకు నేను ఇవ్వగలను కాని లేకపోతే నేను ఎవడిని ఇవ్వటానికి, ఈ అహంకారం మీకు మామిడిపండు ఇవ్వగలదా? భగవంతుడే మీకు ఇస్తున్నాడుకాని మీరు నేను ఇస్తున్నాను అనుకొంటున్నారు అందుకు సిగ్గు వేస్తోంది, అందువలన మీ మొఖాలు చూడలేక తలవంచుకొని ఇస్తున్నాను అని చెప్పారు. మీకు అసలు

రజోగుణం వేగం తగ్గితేకదా తలవంచుకొంటారు, ఆవేగం తగ్గకపోతే మీరు ఎక్కడ తలవంచుకొంటారు. మీరు ఎవరికైనా సహాయ సహకారములు చెయ్యాలనుకొంటే వారు అవకాశం ఇస్తే మీరు చెయ్యగలుగుతున్నారు కాని వారు అవకాశం ఇవ్వకపోతే ఎలా చేయగలరు. అంటే మీరు పవిత్రులు అవ్వటానికి వారు మీకు సహకరిస్తున్నారు, అది మర్చిపోకూడదు. ఇతరులు మంచివారా, చెడ్డవారా అనేది మనకు అనవసరం. రాగద్వేషములు లేకుండా, నీ డ్యూటీ ఏదో నువ్వు చెయ్యి. చేతులతో పని చెయ్యి, మనస్సుతో నామస్మరణ విడిచిపెట్టకు. అప్పడు నీవు ఇహం, పరం రెండూ సాధించినవాడవు అవుతావు. మనకు భగవంతుడు ఏపని అయితే ఇచ్చాడో ఆపనిని చేస్తూ, ఆయన అనుగ్రహాన్ని సంపాదించటానికి ప్రయత్నం చేయాలి. సత్వగుణాన్ని సంపాదించుకోవాలి. తమోగుణం, రజోగుణం తగ్గించుకోవాలి. మనందరము తమోగుణంలో ఉన్నాము కాని సత్వగుణంలో ఉన్నాము అనుకొంటున్నాము. ఇక్కడే ప్రమాదం ఉంది. ఇతరులలో ఉన్న దోషాల గొడవ నీకు అనవసరం, నీలో ఏ దోషాలు ఉన్నాయో చూసుకొని వాటిలోనుండి విడుదల పొందటానికి ప్రయత్నించు. మన బుద్ధిలో ఉన్న దోషాలు పోవాలంటే కేవలం మన తెలివితేటలవలన, మన సాధన వలన అవిపోవు, ఈశ్వరుని పాదాలను ఆశ్రయిస్తే, నిరంతరం ఈశ్వరుని స్మరిస్తూ ఉంటే ఆయన అనుగ్రహంవలన బుద్ధిలోని దోషాలు పోతాయి. ఈశ్వరుని పాదాలయందు భక్తి పెంచుకొంటూ ఉంటే, మనం జ్ఞాన సముపార్జన చేస్తూఉంటే మన హృదయంలో ఉన్న ఆనందం, శాంతి మనకు తెలుస్తూ ఉంటుంది.

నువ్వు కష్టపడి పనిచేసుకో కాని నేను చేస్తున్నాను అనే తలంపును వదిలిపెట్టు. అలా పనిచేయటం వలన నీకు అలసట ఉండదు, నీవు బంధింపబడవు. పనిచేసే స్థూల దేహం నీవుకాదు, నేను పనిచేస్తున్నాను అనిచెప్పే సూక్ష్మదేహం కూడా నీవుకాదు. నీవు అదీకాదు, ఇదీకాదు. నువ్వు ఏదో అది గుర్తించు. ధ్యానం చేయటంలో, అధ్యయనం చేయటంలో, ప్రవచనం చేయటంలో అశ్రద్ధ పనికిరాదు. నీవు ఒక మంచిపని చేసావు అనుకో, ఆపని చేసేది శరీరం, మంచిపని చెయ్యాలనే తలంపు సూక్ష్మదేహం నుండి వచ్చింది. నీవు మంచి చేస్తే సుఖరూపంలో, చెడు చేస్తే దుఃఖరూపంలో అనుభవంలోనికి వస్తుంది. ఈ రెండూ కాల ప్రవాహములో కొట్టుకొని పోతాయి. అసలు నీవు ఎవరిగా ఉన్నావో ఆ జన్మరహితమైన వస్తువును, మరణరహితమైన వస్తువును మర్చిపోవద్దు. దాని స్వరూపమే ఆనందం, దాని స్వరూపమే శాంతి, దాని స్వరూపమే ఉండటం. అది నీవై ఉన్నావు. నువ్వు ఎవరిగా ఉన్నావో దానిని మర్చిపోవద్దు. విగ్రహాన్ని ఆరాధిస్తే పవిత్రత వస్తుందా అని అడిగితే ఆ విగ్రహాన్ని రాయి, రాయి అనుకోవటంవలన నీకు పవిత్రత రాదు, ఆవిగ్రహం మీద నీకు దేవతాబుద్ధి ఉంటే నీకు





ఏకాగ్రత కలుగుతుంది, పవిత్రుడవు అవుతావు, నీకు మోక్షం కలుగుతుంది. మరణానంతరం ఒక మనిషికి, ఇంకో మనిషికి సంబంధం ఉండదు. మరణానంతర జీవితంలో మనకూడా వచ్చేవాడు గురువు మాత్రమే, ఈశ్వరుడు మాత్రమే. ఒక్క ఈశ్వరుడితో అనుబంధమే మనకు శాశ్వతంగా ఉంటుంది. భగవంతుడు నీకు ఇచ్చిన పనిని భారంగా చెయ్యకు. ప్రేమగా చెయ్యి, హితవుగా చెయ్యి, ఓర్పుగా చెయ్యి, అది భగవంతుడు నీకు ఇచ్చిన అవకాశం అనుకో. నీకు పనిలేనప్పడు భగవంతుడిని స్మరించుకో అంతేగాని రోడ్డుమీద ఉన్న దుమ్ము అంతా నీ నెత్తిన రాసుకోవద్దు. సాధ్యమైనంతవరకు ఇతరుల విషయాలలో కలుగజేసుకోవద్దు, దానివలన అహంభావన పెరిగిపోతుంది. అందువలన బహుజాగ్రత్తగా ఉండు. నీవు ఏపనిచేస్తున్నప్పటికి నీ మనస్సును మాత్రం భగవంతుని యందు నిలబెట్టు. అన్నింటికంటె భక్తిమార్గం సులభం. భక్తి మార్గమును ఆశ్రయించి మీరు మోక్షమును పొందవచ్చునుకాని విశ్వాసం కుదరాలి. మీకు నిజమైన విశ్వాసం కుదిరితే, శరణాగతి కుదిరితే మీ శరీరంలో ఉన్న అవయవాలు, మనస్సులో ఉన్న తలంపులు అన్నీ ఎక్కడికక్కడ కండిషన్‌లో పడిపోతాయి. మీ బుద్ధిలో వంకరలు ఉంటే నిదానం అయిపోతాయి. శరణాగతే అన్ని వంకరలను సరిచేస్తుంది. ఒక్క శరణాగతి వలననే అన్నీ సరి అయిపోతాయి అని భగవంతుడు చెప్పాడు. శరణాగతికి మించిన ప్రార్థనగాని, శరణాగతితో సమానమైన ప్రార్థనగాని ఈ సృష్టిలో ఏదీలేదు.

మోక్షం ఎప్పడు వస్తుంది అని ఎదురుచూడటం భక్తియొక్క వైభవానికి భంగం అంటారు కృష్ణ భక్తులు. నిజమైన భక్తుడు దేనికోసం ఎదురుచూడడు. ఎదురుచూడటం వలన అశాంతి వస్తుంది. భక్తుడు ఏపనిచేసినా అతని మనస్సు ఈశ్వరుని పాదాలయందు ఉంటుంది. ఇంకవాడికి ఆందోళన ఉండదు, అశాంతి ఉండదు. భక్తుడు భగవంతుడితో ఏమి అంటాడు అంటే నువ్వు కల్పించిన విషయాలు నాకు వద్దు నువ్వేకావాలి అంటాడు. మనందరకు చైతన్యం అంటే ఇష్టం ఉండదు, మనబుద్ధి జడబుద్ధికాబట్టి జడం అంటే మనకు ఇష్టం. మన దురదృష్టం ఏమిటి అంటే మనం ఒక మనిషికి ఉన్న ఆస్తిని చూస్తాముగాని, ఆ మనిషిలో ఉన్న మంచితనం చూడలేము. మంచితనాన్ని చూసేకళ్ళు మనకు లేవు. ఇంక మనకు జ్ఞానం ఏమిటి? ఒక మనిషిలో ఉన్న ఔన్నత్యం సత్పురుషులకు తెలుస్తుందిగాని సత్పురుషులుకాని వారికి అది తెలియదు. మంచితనం అనేది బజారులో కొనుక్కొనే వస్తువుకాదు, ఎన్నో జన్మలు సాధనచేస్తే మంచి మనస్సు వస్తుంది.

మీ హృదయగుహలో ఆనందం, శాంతి లేదు అనుకోండి మీరు ఆనందాన్ని కోరరు. మీ హృదయంలో ఏదైతే ఉందో అదే మీరు కోరుకొంటున్నారు. మీ హృదయంలో ఆనందం

ఉంది కాబట్టి మీకు తెలియకుండా అదే మీరు కోరుకొంటున్నారు. మీ హృదయంలో ఉన్న ఆనందం మీకు అందుతూ ఉంటే మీ మనస్సు అసలు బాహ్య విషయాలలోనికి రానేరాదు. వివేకంతో కూడిన మంచితనం ఎలా ఉంటుంది అంటే నీవు వారిని ద్వేషిస్తూ ఉన్నా వారిలో ఉన్న మంచితనాన్ని, శాంతిని పోగొట్టుకోరు. ద్వేషించేవారి మధ్యలో ద్వేషంలేకుండా ఉంటారు. వారికి తెలియకుండానే వారు బ్రహ్మానుభవం పొందుతారు. మీకు ఏదైనా కష్టం వచ్చింది అనుకోండి ఈ కష్టాన్ని ఎలా పరిష్కారం చేసుకోవాలో ఆలోచించుకోవాలి. ప్రతీ సమస్యకు చావు అనేది పరిష్కారం కాదు. కొంతమంది ఇంట్లో బాధవస్తే చనిపోతాం అంటారు. ఇంక నీ వివేకం ఏమైంది? ఈ సమస్య వచ్చింది ఇందులో నుండి ఎలా బయటపడాలి అనేది చూసుకోవాలి. దేనికీ చావు అనేది పరిష్కారంకాదు. నిజంగా నీవు చనిపోయావు అనుకో నీ మనస్సు నీకూడా వచ్చేస్తుంది, ఆ మనస్సు ఇంకా చిక్కబడిపోతుంది. నీవు ఎక్కడికి వెళ్ళినా నీ మనస్సు నీ కూడా వచ్చేస్తుంది. మనస్సు అనేది నీ సొంత సమస్య. మనస్సు అనే సమస్యను పరిష్కారం చేసుకొనేవరకు నీకు ఆత్మజ్ఞానం లేదు, ఆత్మసుఖం నీకు అందదు. నీవు సత్పురుషులను ఆశ్రయించు, సద్గ్రంథాలను అధ్యయనం చెయ్యి, ఈ మనస్సు అనే సమస్యకు పరిష్కారం చేసుకో. అది శేషం లేకుండా నశించాలి. కొద్దిగా శేషం ఉన్నా నీకు పునర్జన్మలు వచ్చేస్తాయి. మనస్సు అనేది నీ సొంత సమస్య. దానిని ఫేస్ చెయ్యి, దానిని పరిష్కారం చేసుకో. అది శేషం లేకుండా నశించాలి. అప్పుడు నీ హృదయంలో ఉన్న శాంతి, ఆనందం నీకు అందుతాయి. ఇంట్లో పని విడిచిపెట్టవద్దు, పనిచెయ్యి, మమకారం లేకుండా చెయ్యి. ఆత్మ అకర్త, అభోక్త దానికి కర్తృత్వంలేదు, భోక్తృత్వంలేదు. అహంకారానికే కర్తృత్వం, భోక్తృత్వం. సూర్యుడికి చీకటి ఎలా ఉంటుందో తెలియదు. అలాగే చైతన్యానికి కర్తృత్వంగాని, భోక్తృత్వంగాని తెలియదు. మనస్సు బయటకు వెళితే బంధం, లోపలకు వెళితే శాంతి. మనస్సు బయటకు వెళితే రూపచింతన, నామచింతన. మనస్సు లోపలకు వెళితే అంతా చైతన్యమే, అంతా నారాయణ స్వరూపమే. నీకు అజ్ఞానం లేనప్పుడే పని బాగా చేయగలవు. ఈశ్వరుడి మీద ఉన్న భక్తి నీ పనికి ఆటంకపడదు, నీచేత పనిబాగా చేయిస్తుంది. నిజమైన భక్తివలన నీ పనికి ఆటంకం లేదు, అహంకారమే నీపనికి ఆటంకం.

పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా దీర్ఘశరణాగతిలో నిలబడి ఉండాలి. శరణాగతి స్థిరంగా ఉంటే మనకు మోక్షాన్ని పట్టి ఇస్తుంది. కొంతమందికి స్వార్థమే పరమార్థం, కపటమే కేంద్రంగా పెట్టుకొని జీవిస్తూ ఉంటారు. వారికి ఆత్మజ్ఞానం ఏమిటి? వారు ఇహానికి, పరానికి పనికిరారు. చేతితో దక్షతగా పనిచెయ్యి, మనస్సులో శుచిగా ఉండు. నువ్వు అలా ఉన్నావు అనుకో నువ్వు అంటే ఇష్టపడతాను, ఇష్టపడటమేకాదు నా స్వరూపాన్ని

20-06-2002



నీకు ఇస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు.

## రమణభాస్కర

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 27-05-2002, పాలకోడేరు)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన లోపల సద్వస్తువు ఉంది. దానికి జననం లేదు, మరణం లేదు. అది మన మాటకు, మనస్సుకు అందదు. మాట, మనస్సు అణిగిపోతే అది తెలియబడుతుంది. దేహము నేను అనే తలంపు మనకు అందరికి ఉంది. దానితో చేసే పనులు మనకు ఉపయోగపడవు, సమాజానికి ఉపయోగపడవు. మనం దేహాభిమానం పెంచే పనులు చేస్తూ, ఎన్ని గంటలు ధ్యానం చేసినా దానివలన ప్రయోజనం ఏమీలేదు. మనం ఎన్ని సాధనలు చేసినా, ఎంత ప్రయత్నంచేసినా మన హృదయంలో ఉన్న ఈశ్వరుడు కలుగచేసుకోకుండా మనకు జ్ఞానం రాదు. మనం చేసేది 10%, ఆయన ఇచ్చేది 90%. మనం సాధన చేయగాచేయగా ఆయన కలుగజేసుకుంటాడు. ఆయన కలుగచేసుకొంటే మనలో ఉన్న అజ్ఞానం నశిస్తుంది, మన పని పూర్తి అవుతుంది. మనకు భగవంతుడి మీద ఉన్న విశ్వాసం నిజమైతే మన ప్రయత్నంతో నిమిత్తం లేకుండా మన పనులు పూర్తి అవుతాయి. మీ దేహప్రారబ్ధంలో ధనవంతులు అయ్యే యోగం ఉంది అనుకోండి. మీ ధనాన్ని చూసినేను అసూయపడుతూ ఉన్నా, మీరు ధనవంతులు అవ్వకుండా నేను ఆపలేను. పైగా ఈ అసూయవలన ఏదోరోజు దాని తాలూక ఫలితం నేను అనుభవించాలి. మనస్సు ఉన్నంతకాలం మనకు స్థూలదేహాలు వస్తూనే ఉంటాయి. అందువలన మనస్సుతో విరోధం పెట్టుకోకుండా, మనస్సుతో స్నేహంగా ఉంటూ దానిని స్వాధీనం చేసుకోవాలి. మనకు ఆత్మ అంటే ఇష్టంలేదు, అనాత్మ అంటే ఇష్టంగా ఉంది. మీరు దేనికి భయపడవద్దు. ఈశ్వరుడిని విశ్వసించండి, మీకు ఈశ్వరుడి మీద పరిపూర్ణమైన విశ్వాసం కలిగితే మీరు అనాత్మనుండి విడుదల పొందుతారు అంటే మీరు ఏదైతేకాదో దానిలోనుండి విడుదల పొందుతారు, మీరు ఏదిగా ఉన్నారో ఆ సద్వస్తువు మీకు అనుభవంలోనికి వస్తుంది. నీవు పూజ చేసినా, జపం చేసినా, ధ్యానం చేసినా వీటివలన మనస్సుకు నిగ్రహం రావాలి. మనో నిగ్రహం లేకుండా మనస్సుకు అంతర్ముఖస్థితి కలుగదు. నీవు చేసే ధ్యానం నిజమైతే నీ మనస్సుకి అంతర్ముఖం రావాలి, సహనం రావాలి. మనకు ఉండవలసినంత వినయం లేదు, సత్వగుణం లేదు. డబ్బును సంపాదించేవాడు, ఆ డబ్బును సంపాదించటంకోసం ఎలా కష్టపడతాడో అలాగ మనంకూడా కష్టపడి సత్వగుణాన్ని సంపాదించుకోవాలి. మీరు సాధన బాగా చేయాలనుకొన్నప్పుడు మీ శరీరాన్ని ఎక్కువ సుఖపెట్టవద్దు అని గాంధీగారు చెప్పారు.

**రమణ భాస్కర**

టీచింగ్ లేకపోతే నీకు సబ్జక్టుపట్ల సరియైన అవగాహనరాదు. సబ్జక్టు అర్ధమవుతూ ఉంటే నీవు ఎంతోకొంత ఆచరిస్తావు. సబ్జక్టు విలువ తెలుస్తూఉంటే ఆచరించకుండా నీవు ఉండలేవు. ధనం సంపాదించుకోమని మనకు ఎవరూ చెప్పటంలేదు కాని మనం ధనం సంపాదించుకొంటున్నాము. ఎందుచేతనంటే ధనం వలన భోగం అనుభవించవచ్చు అని మనకు తెలుస్తోంది. జ్ఞానం విలువ మనకు తెలియటంలేదు అందువలన దానిని సంపాదించటానికి మనం ప్రయత్నం చేయటంలేదు. ప్రతీజీవుడికి మూడు దోషాలు ఉంటాయి. ఆవరణదోషం, మలదోషం, విక్షేపదోషం. పూర్వజన్మలో మనం చేసినపొరపాట్లు, మన బలహీనతలు అన్నీ మలదోషంగా వస్తాయి. ఆవరణదోషం అంటే స్వపరబేధం. నీవువేరు, నేనువేరు అనే బేధ బుద్ధి. విక్షేపదోషం అంటే శరీరం ఎక్కడ ఉందో, మనస్సు అక్కడ ఉండదు. విక్షేపదోషం వలన మనస్సు ఎప్పడూ చలిస్తూ ఉంటుంది. ధ్యానం చేయటంవలన మలదోషం, విక్షేపదోషం పోతాయి. ఆత్మజ్ఞానం కలిగితేగాని ఆవరణదోషం పోదు.

ఎవరినీ ద్వేషించవద్దు, అందరిపట్ల మిత్రభావన కలిగి ఉండండి, సహనం కలిగి ఉండండి. సహనం లేకపోతే జ్ఞానం కలుగదు. నీవు ధ్యానం చేస్తూ ఉంటేనీకు యోగ్యత కలుగుతుంది, అర్హత కలుగుతుంది. అప్పడు ఈ ధ్యానం చేసేవాడు ఎవడు అని విచారణ వస్తుంది. ఇప్పడు ఏదైతే నీకు నేనుగా వ్యక్తమవుతోందో ఆనేను నశించిన వెంటనే నీకు ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. ఆత్మ అంటే ఎవరు? నువ్వే. అంటే నీవు ఎవరో నీకు తెలుస్తుంది. మీరుచేసే ప్రయత్నం మీరు చేయండి. మీరు ఏ వస్తువునయితే తెలుసుకోవాలి అనుకొంటున్నారో దాని తాలూక దయలేకుండా అది మీకు తెలియబడదు. కనిపిస్తున్న మనుషులమీద మనకు దయలేదు. కనిపిస్తున్న మనుషుల మీద నీకు దయలేదు, నా దయను అడుగుతున్నావు ఏమిటి అని ఈశ్వరుడు అడుగుతాడు. నీ శరీరాన్ని, నీ మనస్సును మర్చిపోయి జీవితంలో ఒక మంచిపని చేసావా? ఒక మంచిమాట మాట్లాడావా?

భగవంతుడు మీ హృదయంలోనే ఉన్నాడు. మీకు ఏదైనా కష్టాలు ఉంటే, కోరికలు ఉంటే ఆయనతో చెప్పకోండి. ఆయనను ప్రార్ధనచేస్తే మీ ప్రార్ధన వృధాకాదు, మీరుఏదైనా మంచి పనిచేస్తే ఆమంచి పని వృధాకాదు. మీరు చేసిన మంచిపనికి, మీ ప్రార్ధనకు భగవంతుడు ఫలితాన్ని ఇచ్చేస్తాడు. మీరు చేసినది మీకే ఇచ్చేస్తాడు. మీరు గుడికి వెళ్ళి ప్రార్ధన చేయనక్కరలేదు. ఎక్కడ ఉన్నా ప్రార్ధన చేయవచ్చు. మీ ప్రార్ధన వినేవాడు మీ హృదయంలోనే ఉన్నాడు, అంతర్యామిగా ఉన్నాడు. ప్రారబ్ధాన్నిబట్టి ఈ దేహం వచ్చింది. ప్రారబ్దం పూర్తి అయ్యేవరకు ఈ దేహం భూమిమీద తిరుగుతుంది. అందువలన దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టి నీ పని





నువ్వు చూసుకో అంటే అమృతానుభవం పొందటానికి ప్రయత్నం చెయ్యి. రాగద్వేషములు ఉన్న మనిషికి వాడు ఎంతటివాడైనా వాడికి శాంతి దొరకదు. విరోధులు కూడా దేహప్రారబ్దమునుబట్టి సిద్ధమవుతారు. ఎవరో మనలను ద్వేషిస్తూ ఉంటే మనకు నష్టం ఏమిటి? వాడు మన డబ్బును తినేస్తాడా? మన గౌరవాన్ని తినేస్తాడా? వాడి గురించి మీకు అల్లరి ఎందుకు? ఎందుకు కంగారుపడతారు. ఇది అంతా ప్రారబ్దంలో ఒక భాగం. మీ ప్రారబ్దంలో ఉన్నదే వస్తుంది. అందుచేత అటుచూసే బదులు ఇటుచూడండి అంటే మీ హృదయంలోనికి చూసుకోండి. మీ దేహం ఎంత నిజమో ఈ స్నేహితులు, విరోధులు కూడా అంతేనిజం. ఇవి అన్నీ పట్టించుకొంటే మీ మనస్సు బాహ్యాముఖానికి వచ్చేస్తుంది. మీకు ఉపయోగంలేని తలంపులు వస్తున్నాయి అనుకోండి. ఇలాంటి తలంపులు వస్తున్నాయి ఏమిటి అని ఉద్రేకపడవద్దు, వాటిని పట్టించుకోవద్దు, నవ్వేసి వదిలేయండి అవే పోతాయి. అక్కరలేని తలంపులు వచ్చినప్పడు వాటితో తాదాప్యం పొందవద్దు, ఆ తలంపులను చూసి నవ్వుకోండి అవే పోతాయి. ఈ శరీరం ఉండగానే మనం దైవీగుణాలను సంపాదించుకోవాలి. దైవీ సంపదే శరీరం మరణించిన తరువాత మనకూడా వస్తుంది. గాఢనిద్రలో మనస్సులేదు, భగవంతుడు ఉన్నాడు. నీకు తెలిసినా, తెలియకపోయినా భగవంతుడు అంతర్యామిగా ఉన్నాడు. ఆయనను తెలుసుకోవటానికి నీకు ఏవిషయాలు అయితే అడ్డువస్తున్నాయో వాటిని బయటకు లాగి కాల్చి బూడిదచెయ్యి. అదే సాధన. మన ప్రయత్నం లేకుండా ఒక విషయం మీదకు మన మనస్సు వెళుతూ ఉంటే పూర్వజన్మలో ఆ విషయాన్ని మనం బాగా ఎంజాయ్ చేసాము అని అర్ధం. మనస్సు ఏ విషయంమీద వాలుతోందో చూసుకొని దానిని పట్టుకొని వెనుకకు లాగి దానిని ఉపసంహరించు. దానిని అంటిపెట్టుకొనే విషయాలు అన్నీ ఉన్నాయి. నీవు మనస్సును ఉపసంహరించినప్పడు విషయాలు నశిస్తాయి. నీకు ఏ బలహీనత ఉందో ఆ బలహీనత లేనివారితో సహవాసం చేస్తే వారి వైబ్రేషన్స్ నీమీద పనిచేస్తాయి, ఆ బలహీనత నశిస్తుంది.

రామనామం నిరంతరం చింతించటంవలన, ధ్యానించటంవలన ధర్మ ఆచరణ మనకు అలవాటు అవుతుంది, ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం సహజంగా వచ్చేస్తాయి. మనం సాధన చేస్తున్నాము అంటే దానివలన నీ మనస్సు పవిత్రం అవ్వాలి. లోపలఉన్న చైతన్యం ఎంత పవిత్రమైనదో నీ మనస్సుకూడా అంత పవిత్రమైతే అందులో ఐక్యమవుతుంది. ఆత్మ విశ్వాసం మంచిదికాని ఆత్మహింసమంచిదికాదు. ఆత్మ ఎంత సహజంగా ఉందో అంత సహజంగా ఉండటం నేర్చుకోవాలి. ఆత్మకు చలనం లేదు ఆత్మస్థితిని పొందినప్పడు నీకు కూడా చలనం

ఉండదు. ధ్యానం మంచిదే కాని దైనందిన జీవితంలో మీ ప్రవర్తన ఎలా ఉందో చూసుకొంటూ ఉండాలి. మిమ్మల్ని ఎవరైనా తిడుతున్నారు అనుకోండి, అది బ్రహ్మం అనుకోండి. మిమ్మల్ని ఎవరైనా పొగుడుతున్నారు అనుకోండి అది కూడా బ్రహ్మమే అనుకోండి. మీరు చూసేది బ్రహ్మం, వినేది బ్రహ్మం, మాట్లాడేది బ్రహ్మం అయితే ఇంక మీ మనస్సు ఎక్కడకు వెళుతుంది. మీరు ఆనందంగా, సుఖంగా రోజులు గడిపేయవచ్చు. ప్రయత్నంతో చేసేది పూజ, జపం, ధ్యానం. ఏ ప్రయత్నం లేనిస్థితి సమాధిస్థితి. సమాధిస్థితే సహజస్థితి. మనందరికి దుఃఖం వస్తోంది కారణం మనం అసహజస్థితిలో ఉన్నాము. సహజస్థితిలో ఉన్నవాడికి దుఃఖం రాదు. భగవంతుడిపట్ల మనకు నిజమైన ప్రేమ ఉంటే, భగవంతుడి అస్థిత్వం పట్ల మనకు నిజమైన విశ్వాసం ఉంటే పెద్ద సాధనలతో పనిలేకుండా మన మనస్సు కండిషన్‌లో పడిపోతుంది. భగవంతుడు ఉన్నాడా, లేడా అని మన మనస్సు ఇంకా చలిస్తోంది. భగవంతుడు ఉన్నాడు అనే స్థిరబుద్ధి మనకు కలగాలి. ఈశ్వరుడు అనేవాడు ఉన్నాడు అని స్థిరమైన బుద్ధి కలిగినవాడు, వాడు దురాచారుడైనా అతివేగంగా ఉద్ధరింపబడతాడు. నువ్వుకానిదానితో తాదాప్యం చెందకపోతే అదికూడా ధ్యానమే. పూర్వజన్మలనుండి ఏ అలవాట్లు అయితే వస్తున్నాయో, ఏ అలవాట్లలో మనం పెరుగుతున్నామో ఆ అలవాట్లనుండి విడుదల పొందింపచేయటమే విపాశన లక్ష్యం. ఏది పొందాలి అనే నిర్ధారణ ముందు మనకు ఉండాలి, దాని గురించి స్పష్టమైన అవగాహన ఉండాలి. నీవు సాధన చేసేటప్పుడు అనేక ఆటంకాలు వస్తాయి, వాటిని నెమ్మదిగా తప్పించుకొంటూ వెళ్ళిపో. గమ్యాన్ని మర్చిపోవద్దు. గమ్యాన్ని చేరటానికి తదనుగుణంగా నీ మనస్సును, శరీరాన్ని, నీజీవిత విధానాన్ని మలచుకో. మనకు తెలియకుండా మనలోపల హింసాప్రవృత్తి ఉంది, అందులో నుండి బయటకు రావాలి. మీకోడలు మిమ్మల్ని తిడుతోంది అనుకోండి తరువాత మీకోడలుకు కాలు విరిగింది అనుకోండి. మా బాగా అయ్యింది అని మీరు అనుకొంటారు అంటే మీ లోపల హింసా ప్రవృత్తి ఉంది అని గుర్తు. మీ లోపల చాలా లోపాలు ఉన్నాయి అని అర్ధం చేసుకొని వాటిలో నుండి విడుదల పొందటానికి ప్రయత్నం చేయాలి. నందికూడా మనకు గురువే. నందికి ఇది రాత్రి, ఇది పగలు అనిలేదు నిరంతరం ఈశ్వరుడిని అలాచూస్తూనే ఉంటుంది. మన వంక చూడమంటే చూడదు. మనకు భగవంతుడు సృష్టించిన పదార్ధాలు కావాలి, నందికి భగవంతుడే కావాలి. ఒకటే చూపు, ఒకటే నిదానం. అందుచేత నంది కూడా మనకు గురువే, భగవంతుడి రూపాన్ని ధ్యానించటం వలన, నామాన్ని స్మరించటం వలన ఇతర చింతనలు రావు. మనం దేహంతో విషయాలను వదిలేస్తే జ్ఞానంరాదు. లోపల వదిలేయాలి. దేహంతో వదిలేసి, మనస్సులో వాటిని నిరంతరం చింతిస్తూ ఉంటే వారు ఇహానికి పనికిరారు, పరానికి పనికిరారు. అహంకారానికి





నామరూపములే మేత. ఫలానా రూపంనాది, ఫలానా పేరునాది ఈ రెండూ వదిలేయండి లోపల ఉన్న చావులేనిస్థితి మీకు ఎఱుకలోనికి వస్తుంది.

# రమణభాస్కర

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 04-06-2002, పాలకొల్లు)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

శరీరం ఏదో ఒకరోజు మరణిస్తుంది, మనం అందరం కూడా ఏదో ఒకరోజు ఈ ప్రపంచంలోనుండి సెలవు తీసుకొని వెళ్ళిపోవలసిందే. అందుచేత ఈ శరీరం పడిపోకముందే భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను సాధ్యమైనంత వరకూ ఉపయోగించుకొని దేహము నేను అనే బుద్ధిని తొలగించుకోవాలి. పుట్టిన ఈ శరీరం చనిపోవటం ఎంత సహజమో, చైతన్యానికి ఉండటం అనేది అంత సహజం. శరీరానికి, చైతన్యానికి అణుమాత్రం కూడా సంబంధంలేదు. సూర్యుడు సహజంగా ప్రకాశిస్తూనే ఉంటాడు కాని మేఘాలు అడ్డువచ్చినప్పడు సూర్యుడు మనకు కనబడడు. అలాగే చైతన్యం సహజంగా ప్రకాశిస్తూ ఉంది, అది మీకు గోచరం అవ్వకుండా మీ మనస్సే మీకు అడ్డువస్తోంది. మనం అంతా లౌక్యంగా, తెలివిగా జీవించటం నేర్చుకొన్నాము కాని ప్రేమగా జీవించటం మాత్రం నేర్చుకోలేదు. తోటి మానవుడిపట్ల ప్రేమగా ఎలా జీవించాలి, వారికి ఎలా సహాయ సహకారములు అందించాలి అనేది మనం నేర్చుకోలేదు, అది నేర్చుకోవటమే సాధన. మనకు తలంపులు ఒకదాని తరువాత ఒకటి వస్తూ ఉంటాయి, వాటికి ఒక క్రమం ఉండదు. ఈ తలంపుల యొక్క వేగం వలన సహస్రారం శుద్ధి అవ్వటంలేదు. ఒకమనిషి వాడు ఎంత సాధనచేస్తున్నా, వాడు ఎంతటివాడైనా సహస్రారం శుద్ధి అవ్వనిదే వాడికి జ్ఞానంరాదు. మనం ఏ సాధన చేస్తూ ఉన్నా తలంపుల యొక్క, కోరికల యొక్క వేగం తగ్గించుకొంటూ ఉంటే మన హృదయంలో ఉన్న సత్యం గురించి మనకు కొంచెం, కొంచెం తెలుస్తూ ఉంటుంది, దాని తాలూక సుఖం, శాంతి మనకు అనుభవంలోనికి వస్తూ ఉంటుంది. మనం ధ్యానం చేస్తూ తలంపుల యొక్క, ఆలోచనలయొక్క వేగం తగ్గించుకొంటూరావాలి. లోక వ్యవహారాలలో ఎంతవరకు ఉండాలో అంతవరకే ఉండాలి, అతిగా ఉండకూడదు. అతిగా ఉంటే అశాంతి వస్తుంది, అహంకారం పెరుగుతుంది. ఒక మనిషికి స్వార్ధం పెరుగుతూ ఉంటే అహంభావన పెరుగుతూ ఉంటుంది. స్వార్ధం ఎంత తగ్గించుకొంటే అహంభావన అంత పల్చబడుతుంది. ఈ ప్రపంచం ఒక ట్రైనింగ్ గ్రౌండ్. ఆత్మజ్ఞాన సముపార్జన కోసం నీవు ఈ భూమి మీదకు

వచ్చావు. తిండి, బట్ట, ఇల్లు ఇవి కనీస అవసరాలు. వీటికే నీజీవితాన్ని పరిమితం చేయవద్దు. అవి సంపాదించుకొంటూ నీవు ట్రైనింగ్ పొంది ఆత్మజ్ఞానాన్ని సముపార్జించాలి.

అందరూ మనలను గౌరవిస్తున్నారు అనుకోండి, ఒక్కసారిగా ఎవరైనా మనలను విమర్శిస్తే దానిని మనం తట్టుకోలేము. ఒకరకమైన జీవితానికి అలవాటు పడినప్పుడు, పరిస్థితులు మారితే మనస్సు సడన్‌గా అప్‌సెట్ అవుతుంది. అప్పడు బహుజాగ్రత్తగా ఉండాలి. జీవితం ఎప్పడూ ఒకేలాగ ఉండదు. పరిస్థితులు మారుతూ ఉంటాయి. ఇవి అన్నీ ప్రకృతికి సంబంధించిన విషయాలు. వీటిని పట్టించుకొని, వీటి గురించి ఆలోచిస్తూ ఉంటే ఆధ్యాత్మిక జీవితానికి దూరమవుతారు. కొంతమంది మాట, చేత, ఆలోచన పొందికగా ఉంటుంది, పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నా మనస్సును సమానంగా ఉంచుకొంటారు. ఇటువంటి వారికి సహజంగా జ్ఞానం వస్తుంది. అందరూ మనలను ప్రేమిస్తూ ఉంటే తిరిగివారిని ప్రేమించటం తేలికే. కాని అందరూ మనలను ద్వేషిస్తూ ఉన్నా తిరిగి మనం వారిని ప్రేమించగలగాలి. అది ఆధ్యాత్మిక అంతస్థు. ఆ స్థితికి మనం ఎదగాలి. భగవంతుడి పట్ల నీకు ఉన్న విశ్వాసంలో చలనం ఉండకూడదు. అందరిపట్ల సమానదృష్టి కలిగిఉండు. గుణాలు అన్నీ మనస్సులో ఉన్నాయి, వాటిని చూడవద్దు. అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్న భగవంతుడిని చూడటం నేర్చుకో. ఆధ్యాత్మిక జీవితం అంటే పుస్తకాలు పైనుండి క్రిందకు, క్రిందనుండి పైకి చదవటం కాదు, మీ బంధువులను, స్నేహితులను మీరు ఎలా ప్రేమిస్తున్నారో అలాగ మీ విరోధులను కూడా ప్రేమించగలగాలి. ఏ మనిషి పట్ల నాకు ద్వేషం లేదుకాని ఆ మనిషిలో ఉన్న దోషం అంటే నాకు ద్వేషం, దానిని తొలగించటానికే ప్రయత్నం చేస్తాను అనే వారు గాంధీజీ. మీరు ఊహించిన దానికి విరుద్ధంగా జరుగుతూ ఉంటే కంగారుపడవద్దు. మీకు కొన్ని పాఠాలు నేర్పి, మిమ్మల్ని ప్రిపేర్ చేయటానికే ఇవి అన్నీ జరుగుతున్నాయి అని మీకు తెలియక కంగారుపడుతున్నారు. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే సజీవమైన విశ్వాసం ఒక్కటే చాలు మీరు అజ్ఞానంలో నుండి బయటకువచ్చేస్తారు. అందుచేత ఈశ్వరుడిని విశ్వసించి, ఆయన సందేశానికి అనుగుణంగా నీ జీవితాన్ని తీర్చిదిద్దుకుంటే నీవు ఉద్ధరించబడతావు, నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. ధనం, చదువు, అధికారం ఉన్నప్పడు వాటిని ఎంతో జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. అలా ఉపయోగించినవాడు లింకన్. ఆయన దగ్గర ఒక సెక్రటరీ ఉండేవాడు. సైన్యాధిపతి అతనిని తిడుతూ చెడ్డగా ప్రచారం చేసేవాడు. సెక్రటరీకి అది తెలిసి ఒకసారి లింకన్‌తో సైన్యాధిపతి నన్ను చెడ్డగా ప్రచారం చేస్తున్నాడు అని చెప్పాడట. అప్పడు లింకన్ వాడికి నీవు ఉత్తరం వ్రాయి అని చెప్పాడట. సైన్యాధిపతిని తిడుతూ పదిపేజీల ఉత్తరం వ్రాసి లింకన్‌కు చూపించాడట. లింకన్ అది చదివి నీవు పోస్టుచేయకుండా ముందు నాకు చూపించటం మంచిది అయ్యింది. వాడికంటే ఎక్కువ తిడుతూ ఉత్తరం వ్రాసావు, ఇంక వాడికి నీకు తేడా ఏమిటి? నీరచన, నీమాట, నీజీవితం వాడి తెలివిని, వివేకాన్ని పెంచి ఇంక ఎప్పడూ వాడు ఎవరినీ విమర్శించకుండా ఉండేటట్లు, వాడికి సూక్ష్మబుద్ధి కలిగేటట్లు ఉండాలి అది రచన అంటే అని లింకన్ అన్నాడు.

నీ భారం అంతా భగవంతునిమీద పెట్టు. పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా కంగారుపడవద్దు. పరిస్థితులను చూసి ఇది అంతా నిజం అనుకోవద్దు. ఎవరైనా పొగిడితే పొంగిపోవద్దు, విమర్శిస్తే కృంగిపోవద్దు. నింద, స్తుతులకు అతీతంగా ఉండు. నీ లోపల ఉన్న భగవంతుడు నిందకు, స్తుతికి అతీతుడే, నీ స్వభావం కంగారు పడుతోంది. ఆ స్వభావం మార్చుకో. ద్వైతం సత్యంకాదు. ద్వైతబుద్ధికి అతీతంగా ఉంటే దేహము నేను అనే బుద్ధి పల్చబడుతుంది. నీ మూలం నీలోపలే ఉంది. అందువలన ఈ ప్రపంచంలో ట్రైనింగ్ పొంది నీవు లోపలకు వెళ్లటం నేర్చుకోవాలి. నీవు లోపలకు వెళ్లటం నేర్చుకోవటానికే ఆధ్యాత్మిక జీవితం కూడా. మాణిక్యవాచకర్ అరుణాచలేశ్వరుని ఏమని ప్రార్థించాడు అంటే నేను కుక్క కంటే నీచమైన వాడినే అనుకో, నాలాంటి వారిని కూడా ఉద్ధరించి, నేను నాది అనే బుద్ధినుండి విడుదలచేసి ఆత్మజ్ఞానం పొందటానికి ప్రిపేర్ చెయ్యి అని ప్రార్థించాడు. బయట వస్తువులు నీకు కనబడటానికి సూర్యకాంతిగాని, లైటుగాని అవసరం. వెలుతురు లేకపోతే వస్తువులు కనబడవు. నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు ఎఱుకలోనికి రావటానికి, సత్యవస్తువును దర్శించటానికి నీకు ఆత్మజ్ఞానం అవసరం. జ్ఞాన సముపార్జన అందుకే. నీలో ఐక్యమవ్వటమే నా లక్ష్యం, అయితే ఎందుకు ఐక్యమవ్వలేక పోతున్నాను? నాలో వ్యక్తి భావన ఉంది. ఈ శరీరమే నేను అనుకొంటున్నాను. ఏ కారణం వలన ఈ శరీరమే నేను అని భ్రాంతి పడుతున్నానో ఆ కారణమును బైటకులాగి కాల్చి బూడిద చెయ్యి. అంతేగాని నీలో ఈ బలహీనతలు ఉన్నాయి, లోపాలు ఉన్నాయి అని తీర్పులు చెప్పకు. దేహబుద్ధి నశించేటటువంటి వాతావరణం కలుగజెయ్యి, అటువంటి శిక్షణ ఇయ్యి, నీ దయను చూపించి నీలో ఐక్యం చేసుకో అని మాణిక్యవాచకర్ అరుణాచలేశ్వరుని ప్రార్థించాడు. లోపల ఉన్న వస్తువు సహజంగా ఉంది, మనం అసహజంగా ఉంటున్నాము. ఏకారణం వలన అసహజంగా ఉంటున్నామో ఆ కారణాన్ని తీసెయ్యి. రోడ్డు మీద రాయిని దొర్లించినట్లు ఇటువంటి అనేక శరీరాలలో దొర్లించుకొంటూ వస్తున్నావు. ఇటువంటి శరీరాలు ఎన్ని ధరించానో, ఎన్ని వదిలానో. అయినదేదో అయిపోయింది. ఇప్పటికైనా నాకు ఆత్మబుద్ధిని

కలుగజెయ్యి, నీ పాదాలవద్ద స్థిరంగా ఉండేటట్లు అనుగ్రహించు. ఒకవేళ నీ మీద నాకు విశ్వాసం లేదు అనుకో, విశ్వాసం కూడా నీవేకలిగించు, నేను ఎంతోకొంత ప్రయత్నం చేస్తాను కాని విశ్వాసబలాన్ని నీవే ఇవ్వాలి అని ప్రార్థించాడు.

ప్రపంచంలో ఏ పదార్థంలోను సుఖంలేదు. ఆనందం, సుఖం, శాంతి అంతా నీ హృదయంలోనే ఉంది. నీకు వచ్చే సుఖాలు, దుఃఖాలు, పొంగులు, ప్రకోపాలు, నీ స్నేహితులు, విరోధులు, ఇంట్లోవారు అంతా నీ మనస్సు ఆడుకొనే బొమ్మలు. నీ ప్రారబ్దమును బట్టి కొంతమంది స్నేహంగా, కొంతమంది విరోధంగా ఉంటారు. ఇది అంతా అనాత్మ. ఇది అంతా నీ మనస్సు కల్పించినదే. నీ మనస్సు ఎంత నిజమో ఇవికూడా అంతేనిజం. మనస్సు అణిగినప్పుడు ఈ బొమ్మలు అన్నీకూడా అణిగిపోతాయి. కొంతమంది దుఃఖమును తట్టుకొంటారు. కొంతమంది దుఃఖమును తట్టుకోలేరు. తట్టుకొనే వారి హృదయంలోను దేవుడు ఉన్నాడు, తట్టుకోలేనివారి హృదయంలోను దేవుడు ఉన్నాడు. దేవుడికి అక్కడా సంబంధంలేదు, ఇక్కడా సంబంధంలేదు. దుఃఖం ఎక్కువ, తక్కువ అనేది వాడి స్వభావంలో ఉందిగాని దేవుడిలో లేదు. ఆ స్వభావమును మార్చుకొంటే రోజులు సుఖంగా, శాంతిగా వెళ్ళిపోతాయి. నీవు శరీరంతో తాదాప్యం పొందుతున్నావు, మనస్సుతో తాదాప్యం పొందుతున్నావు, కీర్తితో తాదాప్యం పొందుతున్నావు. ఇవి అన్నీ నీవుకాదు, ఇవి నిజంకాదు. ఇలా నీవుకాని దానితో తాదాప్యం పొందితే ఇబ్బందిపడతావు. నీవు చైతన్యంతో తాదాప్యంపొందు, చావులేని వస్తువుతో తాదాప్యం పొందు. నీవు ఈ శరీరమే ఆత్మ అనుకొంటున్నావు, మనస్సే ఆత్మ అనుకొంటున్నావు. ఆత్మకానిదానిని ఆత్మ అనుకొంటున్నావు. అందుచేత జననమరణ ప్రవాహంలో దొర్లించబడుతున్నావు. ఆత్మకానిదానిని ఆత్మ అనుకొనే అలవాటు బలపడిపోయింది. దీనినుండి బయటకురావటానికి సత్వగుణాన్ని ప్రాక్టీసు చేయాలి. సత్వగుణాన్ని ప్రాక్టీసు చేయటమేకాదు, నెమ్మదిగా అందులో స్థిరపడాలి. సత్వగుణంలో స్థిరపడ్డాక శరీరమే ఆత్మ, మనస్సే ఆత్మ అనుకొనే భ్రాంతి నెమ్మదిగా తగ్గిపోతుంది. శరీరం మరణించాక మనం ఈ శరీరాన్ని, ఇంద్రియాలను, లోకాన్ని విడిచిపెట్టేస్తాము. కాని ఈ శరీరం ఉండగా ధ్యానంచేసి ధ్యానబలం వలన ఈ శరీరమును, మనస్సును, లోకాన్ని విడిచిపెట్టాలి అందుకే ధ్యానం. మాయ అంతా మనస్సులో ఉంది, మనస్సు అనే తెరను కత్తిరించాలికదా. మనస్సు అనే తెర తెగితే లోపల ఉన్న వస్తువు నీకు ఎఱుకలోనికి వస్తుంది. అయితే ఈ మనస్సు అనే తెరను ఎలా కత్తిరించాలి? నీకు ఉన్న పాత అలవాట్లను నెమ్మదిగా తొలగించుకో, కొత్త అలవాట్లు రాకుండా చూసుకో. అప్పుడు నీ మనస్సు నెమ్మదిగా పల్చబడి,





నది వెళ్ళి సముద్రంలో కలిసినట్లు, నీ మనస్సు వెళ్ళి ఆత్మలో లయమవుతుంది, అప్పుడు నీ హృదయంలో ఉన్న ఈశ్వరుడు నీకు వ్యక్తమవుతాడు. కొంతమంది మనిషికి మనిషికి లిటికేషన్ క్రియేట్ చేసి ఆనందపడుతూ ఉంటారు. అది చూసి నీవు కంగారు పడవద్దు, మనస్సును సమానంగా ఉంచుకో. ప్రతిమతం కూడా జగత్తు, జీవుడు, దేవుడు ఈ మూడింటి గురించి చెపుతుంది. అయితే ఈ మూడుగా కనిపించేది ఒక్కటే. నీకు అహంభావన ఉన్నంతకాలం ఈ మూడు నిజమే. అహంభావన నశిస్తే ఉన్నది ఒక్కటే అని నీకు తెలుస్తుంది. అహంభావన నశిస్తేనేకాని నీకు పూర్ణస్థితిరాదు, నీవు నీవుగా ఉండలేవు. నీవు నీవుగా ఉండలేనంత కాలం నిన్ను దుఃఖం వెంటాడుతుంది, ఏదో వెలితి, కొరత నిన్ను వెంటాడుతాయి.

**జ్ఞానదృష్టి అలవరచుకొన్నప్పుడే ప్రపంచం బ్రహ్మమయంగా కనిపిస్తుంది. బ్రహ్మమెవరో తెలియకుండా ఆయన సర్వమయత్వం ఏవిధంగా తెలుసుకోగలుగుతావు?**

**- భగవాన్ శ్రీ రమణమహర్షి**

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు

| | | |
|---|---|---|
| 23-6-2002 | ఆదివారం | జిన్నూరు, శ్రీ రమణ క్షేత్రం |
| 25-6-2002 | మంగళవారం | తాడేపల్లి, విజయవాడ వద్ద |
| 26-6-2002 | బుధవారం | చైతన్య తపోవన్ ఆశ్రమం సందర్శన క్యాంపు |
| 28-6-2002 | శుక్రవారం | సిద్ధాపురం (వయా) ఆకివీడు |

## విప్లవవీరుడు శ్రీ అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవ కార్యక్రమములు
## క్షత్రియ సంక్షేమ పరిషత్ - పాలకొల్లు



దిII 04-07-2002 గురువారం ఉదయం గంII 9-30 నిIIల నుండి విప్లవజ్యోతి శ్రీ అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవ కార్యక్రమములు పాలకొల్లు క్షత్రియ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యములో శ్రీ పెన్మెత్స సత్యనారాయణ రాజు, సూర్యపద్మావతి క్షత్రియ సంక్షేమ పరిషత్ కల్యాణ మండపములో నిర్వహించబడును. ఈ సభకు ముఖ్య అతిధులుగా సద్గురు శ్రీ నాన్నగారు, శ్రీ పి.ఎస్.ఎన్. రాజుగారు (మేనేజింగ్ ట్రస్టీ సద్గురు శ్రీ నాన్నగారు ఛారిటబుల్ ట్రస్ట్, విశాఖపట్నం), శ్రీ డా. దంతులూరి విశ్వనాధరాజుగారు (శ్రీ రమణ హాస్పిటల్స్, భీమవరం), శ్రీ అల్లు వెంకట సత్యనారాయణగారు (యం.ఎల్.ఎ., పాలకొల్లు), శ్రీ శిడగం పాపారావుగారు (మున్సిపల్ చైర్మన్, పాలకొల్లు), శ్రీ ఇసుకపల్లి రామకృష్ణం రాజుగారు (పారిశ్రామిక వేత్త, విశాఖపట్నం), స్వాతంత్ర్య సమరయోధులు, ప్రముఖులు, పెద్దలు విచ్చేయుచున్నారు. ఈ జయంతి కార్యక్రమములను పురస్కరించుకొని క్షత్రియ కుటుంబములలోని పేద విద్యార్థులకు మరియు క్షత్రియేతర మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు "క్షత్రియ సంక్షేమ పరిషత్, పాలకొల్లు", "సద్గురు శ్రీ నాన్నగారు ఛారిటబుల్ ట్రస్ట్, విశాఖపట్నం" మరియు డాII దంతులూరి విశ్వనాధరాజుగారు (భీమవరం) వారి తరపున సద్గురు శ్రీ నాన్నగారి ఆధ్వర్యంలో బహూకరించబడును.

ఈ సభకు అందరూ ఆహ్వానితులే.


## INDIAN INSTITUTE OF HOTEL MANAGEMENT & CULINARY ARTS

Silpa Arcade, Opp : Maris Stella College, **VIJAYAWADA - 8**
☎ 0866 - 472126, Cell : 98490-38522
(Affiliated to American Hotel & Lodging Association, U.S.A.)

**Courses Offered**

**For Graduates - PG Course :**

3 Years Diploma in Hotel Management with American International Certificate from AHLA, U.S.A. with **M.Sc., Hotel Management**. Punjab Technical University, Jaulandhar.
Age : **20** to **24** years.

**For Intermediate Pass (Any Group) :**

3 Years Diploma in Hotel Management with American International Certificate from AHLA, U.S.A. with **Bachelor of Business Management** 3 years from Nagarjuna University.
Age : **17** to **24** years.

**For S.S.C Pass (or) 10th Pass :**

Year Diploma Course in Hotel Management.

1. **Food Production.**
2. **Food and Beverage Service.**
3. **Front Office Management.**
4. **House Keeping.**

Age : **17** to **28** years.

**Above all certificates from AHLA, U.S.A.**

And also




దిII 5-6-2002న విజయవాడలో హోటల్ మేనేజిమెంటు కాలేజీ ప్రారంభోత్సవం చేస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు


## Punjab Technical University, Jalandhar

**COURSES OFFERED :**

1. **B.Sc.,** in **Hotel Management**, 3 Years, Eligibility Inter Pass.
2. **M.Sc.,** in **Hotel Management**, 2 Years, Eligibility any Degree.
3. **P.G. Diploma** in **Cookery & Catering**, Eligibility any Degree.

No Age Limit. Distance Education. Employees also can study the course.